ఐఐసీటీలో ఉద్యోగావకాశాలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో పలు ఉద్యోగ అవకాశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. వాక్ ఇన్ విధానంలో భర్తీ చేయనున్నారు. ఎమ్మెస్సీ, ఎం ఫార్మా, బీటెక్, బీటెక్ ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ పట్టభద్రులు అర్హులని, సెప్టెంబర్ 10న ఐఐసీటీ క్యాంపస్ ప్రాంగణంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిందిగా అధికారులు తెలిపారు. సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్, సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. వివరాలకు ఐఐసీటీ కెరీర్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఆల్గే బయోటెక్నాలజీపై ఐఐసీటీ పరిశోధనలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఆల్గే బయోటెక్నాలజీపై ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు పరిశోధనలు ముమ్మరం చేశారు. వాణిజ్యపరంగా పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పర్యావరణహితమైన ఆల్గే ఉత్పత్తులను ప్రోత్సహించడం, సుస్థిర పర్యావరణ విధానాలను అమలు చేయడం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తోంది. ఈ క్రమంలో ఐఐసీటీ పరిశోధకులు నివేదిత సాహూ, డా. ఎస్ శ్రీధర్ బృందం చేసిన అధ్యయనాలను టైలర్, ఫ్రాన్సిస్ పబ్లికేషన్ మ్యాగజిన్ ప్రచురించింది. ఈ రంగంలో మరిన్ని పరిశోధనలను విస్తృతం చేయడంలో తమ అధ్యయనాలు సాయపడుతాయని ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి.

పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలి

మేడ్చల్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): ఇందిరా మహిళా శక్తిలోని పథకాలను నిర్దేశిత గడువులోగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న 12 అంశాలపై కలెక్టర్ గౌతమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా మహిళా సంఘాల సభ్యులు సాధారణ పెట్టుబడి సమూహాలు, సూక్ష్మ సంస్థలకు కొత్త యూనిట్లను మంజూరు చేయాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 5 : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల వేణుగోపాల్ అన్నారు. మండలంలోని కొలనుపాక జడ్పీ హెచ్ఎస్‌లో పాఠశాల ఉపాధ్యాయులు సంగి ఇస్తారి, జె.అనుపమ, పూర్వ విద్యార్థులు చిట్టబోయిన ప్రవీణ్, చాడ రాజు సహకారంతో అందజేసిన క్రీడా దుస్తులను గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యవతి, లింగేశ్వర్‌రావు, జోసెఫ్, సుకన్య, శ్రీధర్, లక్ష్మణ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గుండాల, సెప్టెంబర్ 5 : మండలంలోని కొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నారగోని బాలరాజు భార్య రేణుక ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ వారి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండబోయిన పరశురాములు, బూడిద కృష్ణ, విక్రమ్, రామస్వామి, కృష్ణ, ఉప్పలయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన పర్రెపాటి వెంకటేశ్ (27) ఇటీవల ప్రమాదశవత్తు బావిలో పడి మృతిచెందాడు. అతనితో చదువుకున్న 2009 పదో తరగతి స్నేహితులు గురువారం వెంకటేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.11వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో చిగుళ్ల మహేశ్, పనుమటి సతీశ్, నరేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వైద్యశిబిరం

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 5 : మండలంలోని తూప్రాన్‌పేట ప్రాథమిక పాఠశాలలో మండల ప్రభుత్వ వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్ సీహెచ్ కాటంరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక వైపు కమ్ముకున్న మబ్బులతో ఏర్పడిన నీలిరంగు ఆకాశం, మరోవైపు అప్పుడప్పుడే తెరిపిచ్చిన ఎండతో నిండిన వాతావరణంలో హుస్సేన్ సాగర్ తీరాన నిర్మించిన రాష్ట్ర సచివాలయం, అమర వీరుల త్యాగాల గుర్తుగా ఏర్పాటు చేసిన స్మారక స్థూపం నగర ప్రజలను ఆకట్టుకున్నాయి. చల్ల చల్లని వాతావరణంలో పచ్చని చెట్లు కనువిందైన గ్రీనరీ అటు వైపుగా వెళుతున్న వాహనదారులను కట్టిపడేశాయి.

వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం

వాంతార

సిటీబ్యూరో, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ) : వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంగా గుజరాత్‌లోని వాంతార పనిచేస్తుందని సీఈవో వివాన్ కరాణి తెలిపారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో గ్రీన్స్ జువాలజికల్ రెస్క్యూ, రీహాబిటేషన్ సెంటర్‌గా దాదాపు 2వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నట్లుగా వివరించారు. రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ఎలిఫెంట్ క్యాంప్ ద్వారా 3500 ఎకరాల్లో దాదాపు 2వేల మంది ఉద్యోగులు కలిసి ఏనుగులకు సేవలు అందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ క్రమంలో కరువు కాటకాల్లో చిక్కుకున్న నమీబియా అటవీ ప్రాణాలను సంరక్షించేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా తెలిపారు.

మా ఇండ్లు కూలిస్తే.. చావే శరణ్యం !

ఏండ్లుగా పన్నులు కడుతున్నాం ◆ సర్కార్‌కు మా ఉసురు తగులుతది

ప్రజాపాలన అంటూ.. బుల్డోజర్ తెచ్చారు

హైడ్రా పర్యటనతో.. భయభ్రాంతుల్లో పేదలు

జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట అంబేద్కర్‌నగర్ వాసుల నిరసన

జవహర్‌నగర్, సెప్టెంబర్ 5: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో హైడ్రా అధికారుల పర్యటనతో పేద ప్రజల్లో భయందోళన మొదలైంది. ఏండ్లుగా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాం.. ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు కడుతున్నాం.. ప్రజా పాలనలో తమ బతుకులు మారుతాయనుకుంటే... బుల్డోజర్ తీసుకు వస్తుండటంతో తమ బతుకులు అగమ్యగోచరంగా మారుతున్నాయని అంబేద్కర్‌నగర్ ఇందిరమ్మ చెరువు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. తమ ఇళ్లలోకి ఎప్పుడు నీరు రాలేదు.. చిన్నపాటి రేకుల ఇంటిని నిర్మించుకుని పాములు, తేళ్ల మధ్య జీవనం వెళ్లదీస్తున్నాం.. పెద్దలపై చూపించే ప్రతాపం పేద బతుకులపై చూపితే తమ ఉసురు ప్రభుత్వానికి తాకుతదని..ఎల్లకాలం ప్రభుత్వం ముందుకు సాగదని కన్నీటి పర్యంతమవుతూ శాపనార్థాలు పెట్టారు. కూలినాలీ చేసుకుని ప్లాటు కొనుక్కొని చిన్నపాటి గూడును కట్టుకుని నివసిస్తున్నామన్నారు. రేణుకానగర్‌లో బంగ్లాలు లేవు... పేదలు బతికే కాలనీపై ప్రభుత్వం కనికరం చూపకుంటే 60 కుటుంబాలు రోడ్డుపాలవుతాయని కన్నీటి పర్యంతమయ్యారు.

హైడ్రాకు వ్యతిరేకంగా జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంబేద్కర్‌నగర్ ప్రజలు

మా బతుకులపై మట్టికొట్టొద్దు

20 ఏండ్ల నుంచి చిన్నపాటి ఇంటిని నిర్మించుకుని బతుకుతున్నాం. కేసీఆర్ ప్రభుత్వం మా ఇండ్లకు 58 జీవో కింద పట్టాలు ఇచ్చి మాకు భరోసా కల్పిస్తే... కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో మా నోట్లో మట్టి కొట్టాలని చూస్తుంది. చెరువుతో మాకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. మా రేణుకానగర్‌ను గత సర్కార్ ఇబ్బంది పెట్టలేదు. హైడ్రా మా లాంటి పేదల ఇండ్లను కూల్చడానికే వచ్చినట్టుంది. చిన్నపిల్లలతో కాలం వెళ్లదీస్తున్నాం. మా కుటుంబాలపై దయచూపి ప్రభుత్వం ఆదుకోవాలి.. లేకుంటే మా చావులను కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తది.

– సత్తయ్య, రేణుకానగర్ అంబేద్కర్‌నగర్

ప్రభుత్వం కక్షగట్టింది

ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నాం. మా కాలనీకి కరెంటు, తాగునీరు, డ్రైనేజీ లాంటి సౌకర్యాలు ప్రభుత్వం కల్పించింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇందిరమ్మ చెరువు పరిశీలనకు వచ్చినప్పటి నుంచి మాకు భయం పట్టుకుంది. కూలికి పోతేనే పొట్ట గడిచే మా బతుకులపై ప్రభుత్వం కక్షగట్టినట్టు చేయడం దుర్మార్గం. చంటి పిల్లలతో జీవనం సాగిస్తున్నాం.. ఇండ్లను కూల్చితే ప్రభుత్వానికి మా ఉసురు తగులుతది. చెరువులో అక్రమంగా లే అవుట్‌లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– అంబిక, అంబేద్కర్‌నగర్ జవహర్‌నగర్

భయం భయంగా బతుకుతున్నాం

దివ్యాంగ కుమారుడితో బతుకు జీవుడా అంటూ జీవనం వెళ్లదీస్తున్నాం. చిన్న రేకుల ఇంటిని వేసుకుని 16 ఏండ్ల నుంచి బతుకుతున్నా. చెరువుకు దూరంలోనే మా కాలనీ ఉంది. అక్రమార్కులు చెరువును కబ్జా చేసుకుని ప్లాట్లుగా మార్చి కోట్లు సంపాదించారు. కూడ బెట్టిన సొమ్ముతో ప్లాటు కొనుక్కొని.. కొంత మంది సాయం చేయడంతో ఇల్లు కట్టుకొని జీవిస్తున్నా.. చెరువును మట్టితో నింపిన వారిపై హైడ్రా ప్రతాపం చూపాలి. మాలాంటి పేద కుటుంబాలను ఆదుకోవాలి. మాకు సహకారం అందించాలి.

– అరుణబాయ్, అంబేద్కర్‌నగర్ జవహర్‌నగర్

టీఎన్జీవోల ఒక్క రోజు మూలవేతనం అందజేత

సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 5 : రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్న సమయంలో అండగా నిలబడటం ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ అన్నారు. గురువారం నాంపల్లి గృహ కల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారీ వర్షాలు, వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకోవాలన్నారు. 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయ, నాల్గో తరగతి, పెన్షనర్ల సంఘ నేతలను సంప్రదించి ఒక్క రోజు మూల వేతనాన్ని ఇవ్వాలని జేఏసీలో ఉన్న 205 సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయని తెలిపారు. నిర్ణయం తీసుకున్న వెంటనే మహబూబాబాద్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమ్మతి పత్రాన్ని అందజేశామన్నారు. టీఎన్జీవో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రవి ప్రకాశ్, హైదరాబాద్ జిల్లా శాఖ కార్యదర్శి విక్రమ్‌కుమార్, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కోశాధికారి బాలరాజు,ఉపాధ్యక్షుడు కురాడి శ్రీనివాస్, సభ్యులు శ్రీధర్, కృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'సాహసమే ఊపిరిగా' పుస్తకావిష్కరణ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : అసాధారణ నైపుణ్య సాధన కోసం ఆరాటపడిన ఒక సర్జన్ డాక్టర్ సి. పలనివేలు స్ఫూర్తిదాయక విజయగాథ 'సాహసమే ఊపిరిగా' (ప్రతికూలతలను ప్రతిఘటించి చేసిన ప్రయాణం) తెలుగు అనువాద పుస్తకాన్ని గురువారం బంజారాహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ప్రముఖ జర్నలిస్టు రామచంద్రమూర్తి ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. జెమ్ ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ సి. పలనివేలు తన జీవితాన్ని 'గట్స్' అనే పేరుతో పుస్తక రూపంలోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆ పుస్తకంలో అతడు ఎదుర్కొన్న అనేక అవరోధాలను పొందుపర్చారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ చాలా మందికి ప్రేరణగగా ఈ పుస్తకం నిలుస్తుందని ప్రశంసించారు. 2006లో పలనివేలుతో పుస్తకం రాయాలని చెప్పానని గుర్తు చేశారు. అతడి కథ ఎంతో మనోహరంగా ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత, జెమ్ హాస్పిటల్ చైర్మన్ డా. సి. పలనివేలు, సెంటర్ ఫర్ దలిత్ స్టడీస్ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, ఎమ్మెస్కో ఎడిటర్ డా. చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండొద్దు

నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, సెప్టెంబరు 5 (నమస్తే తెలంగాణ) : గణేశ్ నిమజ్జన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దని, అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి ఎల్బీ నగర్ జోన్‌లో పర్యటించి చెరువులు, బేబీ పాండ్స్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎల్బీ నగర్ జోన్‌లో కాప్రా చెరువు, బేబీ పాండ్, చర్లపల్లి చెరువు బేబీ పాండ్, నల్ల చెరువు బేబీ పాండ్, నాగోల్ చెరువు బేబీ పాండ్, మన్సూరాబాద్ పెద్ద చెరువు బేబీ పాండ్, సరూర్ నగర్ ట్యాంక్ బండ్‌ను పరిశీలించి నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఏర్పాట్లలో అలసత్వం వహించవద్దన్నారు. మొబైల్ టాయిలెట్, స్టాటిస్టిక్, మొబైల్ క్రేన్లను ఏర్పాటు చేయాలని, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తాగునీటి సరఫరా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్విమ్మర్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు, శానిటేషన్ నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా శాఖల అధికారులకు మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, శానిటేషన్, లేక్స్, ఇంజినీరింగ్, పోలీస్, ఎలక్ట్రిసిటీ, హెల్త్, ఎంటమాలజీ, తదితర విభాగాల అధికారులు, కార్పొరేటర్లు ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, బానోతు సుజాత, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

సిటీబ్యూరో, సెప్టెంబరు 5 (నమస్తే తెలంగాణ) : గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఉద్యోగులు, సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించడం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మేయర్ తెలిపారు. ఈ సంవత్సరం జీహెచ్ఎంసీ ద్వారా 3.10 లక్షల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పంకజ, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొని ఉద్యోగులు, అధికారులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు.

మైనారిటీ ఓట్ల కోసం

పాకులాడటం సిగ్గుచేటు

మాట్లాడుతున్న వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, రాష్ట్ర ప్రచార ప్రముఖ్ బాలస్వామి,

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 5: రాష్ట్రంలో గిరిజనులపై దాడులు జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ ఓట్ల కోసం పాకులాడటం సిగ్గుచేటని విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, రాష్ట్ర ప్రచార ప్రముఖ పగుడాకుల బాలస్వామి, ఉపాధ్యక్షురాలు సునీత రామ్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం కోఠిలోని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న మైనార్టీలను తరిమివేయాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన సంప్రదాయాలను ధ్వంసం చేస్తూ మహిళలపై లైంగిక దాడులు చేస్తున్న దుర్మార్గులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆసిఫాబాద్‌లోని జైనూరులో చోటు చేసుకున్న ఘటనను విశ్వ హిందూ పరిషత్ తీవ్ర స్థాయిలో ఖండిస్తుందని అన్నారు. గిరిజన మహిళను చంపేందుకు ప్రయత్నించిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న గిరిజన మహిళకు కార్పొరేట్ దవాఖానలో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. .ఇంతటి ఘోరం జరుగుతున్నా బాధితుల ఇండ్లపైనే దాడులు చేసి, ఇండ్లను తగులబెట్టడం సరికాదన్నారు. డీఎస్పీని తక్షణమే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. హిందూ వ్యతిరేక చర్యలకు మద్దతు పలకడం ఏ మాత్రం తగదని రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్వర్,రాష్ట్ర ప్రచార సహ ప్రముఖ్ రేగు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ కాలనీలో నిర్మాణాలను కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

మెహిదీపట్నం సెప్టెంబర్ 5: అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మించిన భవనంలో జీహెచ్ఎంసీ సర్కిల్–12 టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం కూల్చివేశారు. నాంపల్లి నియోజకవర్గం నవోదయ కాలనీ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఓ భవనంలో అనుమతులు లేకుండా 4,5 అంతస్తులు నిర్మించారు. కోర్టు అనుమతులు తీసుకున్న జీహెచ్ఎంసీ సర్కిల్ –12 టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏసీపీ కృష్ణమూర్తి నేతృత్వంలో సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, నర్సింగ్,మోహన్ సిబ్బందితో కలిసి కూల్చివేశారు.

మహాగణపతి పూజకు రావాలంటూ సీఎంకు ఆహ్వానం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 5 : ఖైరతాబాద్‌లో కొలువుదీరిన శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి తొలి పూజకు హాజరు కావాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ఉత్సవ కమిటీ ఆహ్వానం పలికింది. గురువారం ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

'వైన్ షాపుల నుంచి పన్ను వసూలు చేయాలి'

మోత్కూరు, సెప్టెంబర్ 5 : మున్సిపాలిటీ కేంద్రంలో వైన్ షాపుల నుంచి పన్నులు వసూలు చేయడానికి గెజిట్ నోటిఫికేషన్ కోసం మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయాలని కోరుతూ స్థానికులు అవిశెట్టి యాదగిరి, వారాల రాకేశ్ కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోత్కూరు మున్సిపాలిటీ కొత్తగా ఏర్పడడంతో మద్యం షాపుల నుంచి పన్నుల వసూలుకు గెజిట్ లేదని, దీంతో మున్సిపాలిటీ రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతున్నదని అన్నారు. వైన్ షాపులను మున్సిపాలిటీ పన్నుల పరిధిలోకి తెచ్చేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపాలని కోరారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలి : సీపీఎం

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 5 : వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాటూరి బాలరాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి, వరి, వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి దూపటి వెంకటేశ్, నాయకులు సత్యరాజయ్య, పాల్, తులసయ్య, గణేశ్, రాములునాయక్ పాల్గొన్నారు.

పహిల్వాన్‌పూర్‌లో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

వలిగొండ, సెప్టెంబర్ 5 : మండలంలోని పహిల్వాన్‌పూర్ గ్రామంలో ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ పాపన్నగౌడ్ బడుగు, బలహీన వర్గాలను ఏకం చేసి మొఘల్ చక్రవర్తిని ఎదిరించి గోల్కొండ కేంద్రంగా బహుజన రాజ్య స్థాపన చేసి బడుగుల అభ్యున్నతికి కృషి చేసిన నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో గడ్డమీది ధనుంజయ, గౌడ సంఘం అధ్యక్షుడు వట్టిపల్లి యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

అధ్యక్ష స్థానానికి నామినేషన్ వేస్తున్న అంకం పాండు

చేనేత కార్మిక సంఘం ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 5 : పట్టణంలోని పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. నామినేషన్లను పద్మశాలి మహాజన సంఘం ఉపాధ్యక్షుడు అంకం మురళి, ప్రధాన కార్యదర్శి భారత బాలరత్నంకు అందజేశారు. అధ్యక్ష స్థానానికి ముసునూరి యాదగిరి, కర్నాటి పురుషోత్తం, సీత కృష్ణ, అంకం పాండు, ఏలె శ్రీనివాస్, కొంక లక్ష్మీనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. మహిళా డైరెక్టర్ స్థానాలకు నలుగురు, పురుషుల డైరెక్టర్ల స్థానాలకు 19మంది నామినేషన్లు వేశారు.

రేషన్ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

వలిగొండ, సెప్టెంబర్ 5 : మండలంలోని దుప్పెల్లి గ్రామానికి మధిర విలేజ్‌గా ఉన్న ఎర్రకాలువ గ్రామంలో రేషన్ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు గురువారం తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుప్పెల్లి గ్రామానికి ఎర్రకాలువ సుమారు 3కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. రేషన్ సరుకుల కోసం దుప్పెల్లికి వెళ్లాలంటే రోడ్డు సరిగా లేక వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామస్తుల ఇబ్బందులను పట్టించుకొని ఎర్రకాలువలో రేషన్ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ముక్కెర లింగస్వామి, ముక్కెర ముత్తయ్య, ఎలుగు యాదయ్య, ఎలుగు మదార్, కీసరి యాదయ్య, కీసరి బాలయ్య పాల్గొన్నారు.